డేంజర్ జంక్షన్!

- ప్రమాదాలకు కేంద్రంగా మారిన తుక్కుగూడ ఓఆర్ఆర్
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు



తుక్కుగూడ నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు జంక్షన్

తుక్కుగూడ : తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు జంక్షన్ డేంజర్‌గా మారింది. ఈ జంక్షన్ రోడ్డు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి, శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డుతో పాటు తుక్కుగూడ పట్టణ పరిధిలోని హార్డ్‌వేర్ పార్క్, ఈ-సిటీ, వండర్‌లా, నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు అనేక పరిశ్రమలు ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు ఈ జంక్షన్ నుంచి ప్రయాణం చేస్తున్నాయి. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ వాహనాల వేగం నియంత్రించే ఎలాంటి పరికరాలు లేక పోవడంతో జంక్షన్‌లో ఇటు, అటు వెళ్తున్న వాహనదారులు ఢీకొట్టున్నాయి. రాత్రి, పగళ్లు తేడా లేకుండా నిత్యం ప్రతి నిముషం ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

అక్రమంగా వాహనాల పార్కింగ్

ఈ జంక్షన్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు, శ్రీశైలం జాతీయ రహదారిపై భారీ కంటైనర్ వాహనాలతో పాటు, లారీలు, ఇతర వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేయడంతో వాహనాల రద్దీ పెరిగి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు చాలా మంది ఈ జంక్షన్ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. నిత్యం ఇక్కడ పెద్ద మొత్తంలో వాహనాలను పార్కింగ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రింగు రోడ్డు నిర్మాణం కాకపోవడం

2005లో అప్పటి ప్రభుత్వం నెహ్రు ఔటర్ రింగు రోడ్డు నిర్మించే సమయంలో తుక్కుగూడ ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద రింగు రోడ్డు నిర్మించడానికి స్థానికుల నుంచి భూమిని సేకరించారు. రింగు రోడ్డు ఏర్పాటు చేసి ఉంటే రోడ్డు విస్తీర్ణం పెరిగి ప్రమాదాల సంఖ్య తగ్గేంది. అప్పట్లో కొన్ని కారణాల వల్ల రింగు రోడ్డు నిర్మించడం సాధ్యం కాలేదు. రింగు రోడ్డు కోసం సేకరించిన భూమిలో గృహాలు, వాణిజ్య సముదాయలు నిర్మిస్తున్న మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రింగు రోడ్డు లేకపోవడం, అక్రమంగా వాహనాల పార్కింగ్, పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ జంక్షన్ డేంజర్‌గా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



తుక్కుగూడ ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద వాహనాల రద్దీగా ఎక్కువగా ఉంటుంది. దీంతో అటు, ఇటు పోయే వాహనాలు ఢీకొని నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలి.

– బూడిద అన్వేష్‌గౌడ్ మంఖాల్

క్లుప్తంగా

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

తుక్కుగూడ: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల గడువు శనివారంతో ముగిసింది. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి గత నాలుగు రోజుల నుంచి బారులు తీరారు. ఇందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 524పైగా దరఖాస్తులు వచ్చిన ట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ తెలిపా రు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: ఇటీవల వెలువడిన ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన బడంగ్‌పేట మాస్టర్‌మైండ్ కళాశాల విద్యార్థులను శనివారం మంత్రి సబితారెడ్డి అభినందించారు. కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకుంటామని మంత్రి అన్నారు. ఎంసెట్, ఐఐటీ, నీట్, జీఎఫ్‌టీఐలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ పాండు, మేనేజ్‌మెంట్ సభ్యులు నాగేంద్ర, లగ్‌పతి, నవనీత, శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



బడంగ్‌పేట్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో బడంగ్‌పేట కాంగ్రెస్ నేతలు కలుసుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న నిర్ణయాల గురించి చర్చించారు. కలిసిన వారిలో బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ దర్శన్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంటి తదితరులున్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటాలి



తిరంగాను ప్రదర్శిస్తున్న సర్పంచ్

కందుకూరు: ప్రధాని మోదీ పిలుపు మేరకు తిరంగా ఉద్యమంలో అందరూ పాల్గొని దేశ స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటాలని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కందుకూరు పోస్టాఫీస్ ఎస్‌పీఎం మార్కండేయ ఆధ్వర్యంలో కొత్తగూడలో ఇంటింటికి తిరంగా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన జాతీయ జెండా స్వేచ్ఛ, జాతీయ ఐక్యతకు చిహ్నమన్నారు. కార్యక్రమంలో పోస్టాఫీసు సిబ్బంది ఫయాజ్, భిక్షపతి, యుగంధర్, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

లార్డ్స్‌లో డ్రైఫ్రూడ్స్ డే



డ్రైఫ్రూడ్స్ డేలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు డ్రైఫ్రూడ్స్‌డేను నిర్వహించారు. శరీరానికి పోషకాలు అందించడం మన బాధ్యత అని విద్యార్థులకు వివరించారు. పోషకాలు కలిగిన డ్రైఫ్రూడ్స్‌ను నిత్యం తీసుకోవాలని తెలిపారు. శారీరానికి పోషకాలు అందిస్తేనే ఆరోగ్యంతో పాటు అన్ని సీజన్‌లను తట్టుకునేందుకు శరీరం అనువుగా ఉంటుందన్నారు. విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, బ్రాంచ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

తలకొండపల్లి: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన యాదయ్యకు మంజూరైన రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం హైదరాబాద్‌లో ఆయన అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు గణేష్ గుప్తా తల్లి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుందనే సమాచారం తెలుసుకొని ఆమెను పరామర్శించారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కార్పొరేటర్ స్వప్న



వారోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ స్వప్న

బడంగ్‌పేట్: ప్రపంచంలో తల్లిపాలకు మించిన అమృతం మరోకటిలేదని కార్పొరేటర్ భీమిడి స్వప్న అన్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-1లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ స్వప్న హాజరై మాట్లాడారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలను పట్టించాలన్నారు. ముర్రుపాలలో అధిక బలం ఉంటుందని పుట్టిన గంటలోపే పట్టించాలన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను పట్టిస్తే శిశువులు ఆరోగ్యంగా పెరుగుతారని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లల్లో అందచేస్తున్న సరుకులు తల్లులు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణి మహిళలకు శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడీ టీచర్ రేణుక, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

సిమెంట్ బస్తాల పంపిణీ



బాధితులకు సిమెంట్ బస్తాలు అందజేస్తున్న సురేష్

కందుకూరు: మండలంలోని ఆకులమైలారంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు, మరమ్మతులకు సంబంధించి గ్రామానికి చెందిన యువకుడు అచ్చన సురేష్ చేయూత నందించాడు. శనివారం తన వంతుగా ఒక్కో కుటుంబానికి పది సిమెంట్ బస్తాల చొప్పున మొత్తం 350 బస్తాలు ఉచితంగా అందజేశాడు. అతన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అచ్చన వెంకయ్య, నాయకులు కృష్ణకుమార్, మొగలయ్య, శ్రీరాములు, సత్యం, శేఖర్, శ్రీనివాస్, రాజు, రాంచంద్రి, ప్రభు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం



పరీక్షలు చేయించుకుంటున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక పేర్కొన్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం హస్తినాపురం, కామినేని హాస్పిటల్ వైద్య బృందంతో వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ దీపిక ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కాలనీవాసులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు శివకుమార్, అమరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణనాయక్, మల్లయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బీఎస్పీ నాయకుడు నర్సింహ



ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

మహేశ్వరం: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నడి నర్సింహ పేర్కొన్నారు. శనివారం గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ హైదరాబాద్ గన్‌పార్కు వద్ద శాంతియుత ధర్నా చేయడానికి వెళ్తున్న బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆటలాడుతుందన్నారు. నిరుద్యోగుల పక్షాన బీఎస్పీ నిరంతరం పని చేస్తుందని చెప్పారు. అంతకు ముందు ధర్నాకు వెళ్తున్న బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో బీఎస్పీ జిల్లా నాయకులు మహేష్‌చారితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ జయశంకర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ బృందం మీర్‌పేట పోలీసులతో కలిసి దాడి చేశారు. తాత చిరంజీవి, తన్నేరు శ్రీనివాస్, కర్రె సుభాష్, వల్లపు రాజు, ధారావత్ పిగ్గునాయక్, లోకరాజులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.8350 నగదు, 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరు



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: పాలమూరు-రంగారెడ్డి, కెఎల్ఐ ఎత్తిపోతల పథకాలతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకి సాగునీరు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కృషితో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు, పర్యావరణ అనుమతులు లభించాయని తెలిపారు. రూ.35 వేల కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి పాలమూర్, రంగారెడ్డి జిల్లాలో 12.50 లక్షల ఎకరాలకు, కల్వకుర్తి నియోజకవర్గంలోని 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. తక్షణమే కాల్వల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మినర్సింహారెడ్డి, కృష్ణయ్య ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, డీటీ వినోద్‌కుమార్, రైతుబంధు అధ్యక్షుడు వీరయ్య, సాయిలు, లాయక్‌అలీ, రమేశ్, వినోద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

తలకొండపల్లి: జిల్లా వ్యాప్తంగా తలకొండపల్లిని ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తలకొండపల్లి మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయని విద్యార్థులు కళాశాల్లో చేరాలని ఎమ్మెల్యే కోరారు. రూ. 37 కోట్లతో తలకొండపల్లి-ఆమనగల్లు వరకు బీటీ డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. సంక్షేమంలో తెంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాలాపుం శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, జెడ్పీ కో ఆప్షన్ ఎండీ ముజిబర్ రహ్మాన్, మాజీ జెడ్పీటీసీ నర్సింహా, ఎంపీటీసీ అంబాజీ, సర్పంచ్‌లు చంద్రయ్య హైమావతి, రామస్వామి, శివశంకర్‌రెడ్డి, సజ్జుపాషా, మార్కెట్ డైరెక్టర్‌లు శేఖర్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: అవురుపల్లి గ్రామంలో శనివారం గౌడసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మండల గౌడసంఘం అధ్యక్షుడు గౌని నర్సింహా ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌడసంఘం అధ్యక్షుడిగా నిరంజన్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అంజయ్యగౌడ్, కార్యదర్శులుగా నర్సింహాగౌడ్, రాములుగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్, కోశాధికారిగా కృష్ణయ్యగౌడ్, సలహాదారులుగా హరిమోహన్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్, బాలకృష్ణగౌడ్, వెంకటయ్య గౌడ్‌లను ఎన్నుకున్నారు

హరితహారంతో పచ్చదనం

అబ్దుల్లాపూర్‌మెట్: హరితహారంతో పచ్చదనం పెంపొందుతుందని, ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సీఐ మన్మోహన్ పేర్కొన్నారు. గుంతపల్లి గ్రామంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేరా మట్టి-మేరా దేశ్‌లో భాగంగా హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ మన్మోహన్ హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశంపట్ల ప్రేమ, అభిమానాన్ని పెంచుకుంటూనే చదువులో రాణిస్తూ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ట తీసుకరావాలన్నారు. ఎస్ఐ సునీల్, కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, శివకుమార్, బాలాజీ, శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా మాదిగలకు అన్యాయం

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్

కడ్తాల్: దశాబ్దాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 28న కల్వకుర్తిలో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ పోతుగంటి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉప కులాలకు రావాల్సిన వాటలో దశాబ్దాలుగా మోసానికి గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. దర్వుల రాంచంద్రయ్య మాదిగ, తుడుం కిరణ్ మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మైసయ్యపాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

తలకొండపల్లి: మండల పరిధిలోని బల్సుల పల్లితండా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు.రవినాయక్, నవీన్ నాయక్, యాదగిరి, రాథోడ్ పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు..

తండ్రి లేని చిన్నారుల చదువులకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ చేయూత నందిస్తున్నాడు. ట్రస్టు ద్వారా ఖర్చులను భరిస్తూ పదోతరగతి వరకు చదివిస్తానని భరోసా కల్పించారు. మండల పరిధిలోని వెల్జాల్, మాదాయిపల్లికి చెందిన భావన, గణేష్, సుప్రియ, మణి దీక్షిత్‌లు 2, 3, 8, 9వ తరగతులు చదువుతున్నారు. స్థానిక నాయకుడు ఎంపీటీసీ అంబాజీ సహకారంతో పిల్లల బంధువులు జెడ్పీటీసీని కలిసి తమ సమస్య వివరించారు. స్పందించిన ఆయన ట్రస్టు ద్వారా నలుగురు పిల్లలను చదివిస్తానని, పదోతరగతి వరకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని భరోసా కల్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కడ్తాల్: ఆర్థిక సాయం చేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

కడ్తాల్: మైసిగండి గ్రామానికి చెందిన సీత్యానాయక్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ తులసీరాం నాయక్, వార్డు సభ్యుడు జవహర్‌లాల్‌నాయక్ పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబానికి సర్పంచ్ తులసీరాం నాయక్ రూ.5వేలు, జవహర్‌లాల్ నాయక్ రూ.5 వేలు అందజేశారు.

స్కూల్ పిల్లల బస్‌పాస్‌లకు..

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన స్కూల్ పిల్లలకు ఫ్రీ బస్ పాస్‌ల కోసం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి రూ. 3వేలు ఆర్థిక సహాయాన్ని ఆర్టీసీ అధికారులుకు అందజేశారు. ఖానాపూర్‌కు చెందిన అంజయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్టు సభ్యులచే రూ.3వేల సహాయం అందజేశారు. కార్యక్రమంలో రవి, గణేష్, మల్లేష్, శివాజీ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

గానుగుమార్లతండాకు చెందిన సాయి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.5వేల సాయం అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, అజ్గర్‌అలీ, ఇమ్రాన్‌బాబా, పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సంఘం నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ యూఎస్‌పీసీ దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య పేర్కొన్నారు. యూఎస్‌పీసీ, ఎన్‌పీఎస్ (సీపీఎస్), ఎన్ఇపి-2020లను రద్దు చేయాలని ఎస్‌టీఎఫ్ఐ దేశవ్యాప్త క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం తుర్కయంజాల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షురాలు కల్పన, జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మహిపాల్, సీనియర్ నాయకులు యాదయ్య పాల్గొన్నారు.

బతుకు.. బండి!



పూలు అల్లుతున్న వ్యాపారి

- ఏరోజుకు ఆరోజే ఆదాయం
- ఎంత అమ్మినా తక్కువే
- లాభాల్లేక పూటగడవని పరిస్థితి
- దుకాణాల కోసం స్థలం కేటాయించాలని మొర

కడ్తాల్: మండల కేంద్రంలో పూల వ్యాపారుల పరిస్థితి రోజురోరజుకు దిగజారుతుంది. కష్టాల మధ్య తమ బతుకు..బండిని లాగుతున్నారు. పూలన్నీ అమ్మిన కొన్ని సార్లు పూటగడవని పరిస్థితి ఏర్పడుతుంది. పెళ్లీల సీజన్‌లో వ్యాపారం సాగుతుంది. వానోచ్చిన, ఎండకాసిన కష్టాలు షరామాములే. మండల కేంద్రంలో సుమారు 10నుంచి 25వరకు కుటుంబాలు ఈ వ్యాపారాన్నే నమ్ముకుని జీవిస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కన చిన్న, చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. కొందరు తోపుడు బండ్లపై మరి కొంత మంది, పూల గంప ఎత్తుకొని ప్రధాన రహదారిపై వ్యాపారం చేసుకుంటున్నారు. రోజురోజుకు పూల వ్యాపారుల పరిస్థితి మరీ దయనీయంగా మారుతుంది. పూలు అమ్మలేక వాడిపోయిన రోజులు కూడా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పూల వ్యాపారులకు సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవాలని చెబుతున్నారు. శాశ్వత దుకాణాల్లేక తాము ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

ఏ రోజుకారోజే అమ్మాలి..

ఏ రోజు పూలు ఆరోజే అమ్ముడు పోవాలి. లేకపోతె నష్టమే. ఈ వ్యాపారంలో లాభాలు తక్కువ వస్తాయి. ఏ మాత్రం అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించినా, గిరాకీ లేక పోయినా ఇక అంతే సంగతులు. అదేవిధంగా పూలు నలిగిపోకుండా, వాడిపోకుండా చూసుకోవాలని వారు చెబుతున్నారు. ఒక్కోసారి ఎన్ని జాగ్రత్తలు వహించినా నష్టాలు మిగులుతాయని ఆవేదన వ్యక్త చేశారు. రోజుకు వెయ్యి నుంచి రూ.3వేల వరకు వ్యాపారం సాగుతుందని వారికి మిగిలేది చాల తక్కువేనని పేర్కొన్నారు.

పెరిగిన ధరలతో ఇబ్బందులు..

మార్కెట్‌లో పూల ధరలు భాగా పెరగడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధరలు పెరగడంతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో మల్లె దండకు (250 గ్రాములు) గతంలో రూ. 50 నుంచి 60 లభించేదని, ప్రస్తుతం కిలో రూ.500కు చేరుకుందన్నారు. తెల్ల చామంతి కేజీ రూ.200, లిల్లీపూలు కేజీ రూ.150 నుంచి 200కు చేరాయని, బంతి పూలు కేజీ రూ.100నుంచి 120కు చేరిందని, కనకాంబరాలు రూ.500, గులాబీ కేజీ రూ.200కు చేరుకున్నాయని తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా, పోల్కంపల్లి గ్రామానికి చెందిన సామ యాదగిరిరెడ్డి, భార్య రమణమ్మ ఇద్దరు కుమారులతో తుర్కయంజాల్ సమీపంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మూడు రోజుల క్రితం భర్తతో డబ్బు విషయమై గొడవ పడింది. దీంతో ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త యాదగిరిరెడ్డి బంధువుల ఇళ్లల్లో వెతికినా లాభం లేదు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.